# నీతి కథ

- పురిపాక శ్రీరామచంద్రమూర్తి

"మీరు సిగరెట్లు కాలుస్తారా?" అడిగింది రజని.

అవునన్నట్టు తలూపాడు కాంతారావు. సిగరెట్టు గట్టిగా పీల్చి, పొగవదలి తృప్తిగా నవ్వాడతను.

"నీ కిష్టంలేదా సిగరెట్లు కాల్చడం?"

"లేదు" అంది రజని.

వాళ్ళిద్దరూ మూడు నెలల నుంచి పరస్పరం చూసుకుంటున్నారు. ప్రేమించేసుకుంటున్నామని తెలుసుకుని ఐదు రోజుల మీద ఆరు గంటలైంది.

ఇప్పటికి వాళ్ళిద్దరూ కలిసి ఒకే ఒక సెక్స్‌కవ్ ప్రేమ సినిమా చూశారు. అందులో చివర్లో ఏదో సందేశం ఉందికాని ముందంతా వానపాటలూ, వేడి నిట్టూర్పులే వున్నాయి.

రెండు సార్లు పార్కుకి వెళ్ళారు. మూడోసారి అంటే ఇదుగో ఇప్పుడు, ఎగ్జిబిషన్ గ్రౌండ్లో తిరుగుతున్నారు.

"మీరు సిగరెట్లు కాల్చొద్దు" అంది రజని.

"ఇక చచ్చినా సిగరెట్లు కాల్చను రజనీ" అని రచయిత్రీమణి అత్యాదర్శాల కథలోలాగా సిగరెట్ పెట్టే, అగ్గిపెట్టె, కాలుస్తున్న సిగరెట్టు విసిరేయలేదు కాంతారావు. వేళ్ళ మధ్య సిగరెట్ వైపోసారి చూసి, గబగబా రెండు దమ్ములుకొట్టి పారేశాడు.

చేతిలోంచి జారి, రోడ్డుమీద పడ్డ ఎంగిలి చార్మినార్ వైపు చిన్నకుర్రాడు దుఃఖపడుతూ చూసినట్టు చూశాడు కూడా.

"ఏదో సరదాగా కాలుస్తాను. దీని గురించి గొడవ దేనికి?" అన్నాడతను.

"నాకా వాసనే గిట్టదు. మా ఇంట్లో ఎవరూ కూడా సిగరెట్లు కాల్చరు" అంది రజని గొప్పగా.

"మీ ఇంట్లో కాల్చరని దేశంలో ఎవడూ సిగరెట్టు ముట్టుకోడా? అలా అయితే సిగరెట్ కంపెనీలన్నీ ఎప్పుడో మూతపడేవి. లక్షల మంది కార్మికులు వీధుల పాలై......

"నేను కాల్చొద్దంటే... అలాగే రజనీ! ఇక నుంచి వెధవ సిగరెట్లు కాల్చనని చెప్పరేం? ఉరికి రెట్టిస్తారు కాని?" అంది రజని కొంచెం కోపంగా.

"సిగరెట్లు కాలిస్తే నష్టమేమిటి? శుభ్రంగా భోంచేసి ఒక సిగరెట్టు కాలిస్తేవచ్చే ఆనందం.........

"రబ్బిష్. మొదట్లో బాగానే వుంటుంది కాని, నలభై ఏళ్ళు దాటాక నానా బాధలు పడాలి. దగ్గూ, ఆయాసం వస్తాయి. సినిమా థియేటర్లో బాల్కనీ క్లాసుకి ఒంటరిగా మెట్లెక్కి వెళ్ళలేరు. వెళ్ళినా దిగలేరు. ఊపిరి తిత్తులు దెబ్బతింటాయి. క్యాన్సరు... క్యాన్సరొస్తుంది. అదెంత డేంజరస్సో మీకూ తెల్సు!

"సిగరెట్లు కాలిస్తే క్యాన్సరొస్తుందనేవాడు బుద్ధిలేని వాడు. క్యాన్సరొచ్చిన వాళ్ళలో ఎక్కువ మంది సిగరెట్లు కాల్చేవాళ్ళే. వాళ్ళకేదో కారణంమీద క్యాన్సరొస్తే, సిగరెట్లు కాలిస్తేనే క్యాన్సరొచ్చిందని ప్రచారం చేస్తున్నారు. ఇదీ అసలు కిటుకు" అన్నాడు కాంతారావు. సిగరెట్లు మానకుండా ఉండడానికి. ఎన్నిరకాలుగా బుజ్జగించుకోవాలో అతనికి తెలుసు.

"ఎంతసేపైనా వాదిస్తారు కాని సిగరెట్లు మానేస్తానని మాత్రం చెప్పరు. ఇంత చిన్నపని చెయ్యలేని వాళ్ళు రేపు పెళ్ళయ్యాక ఇంకేం సుఖపెడతారు?" అంది రజని దెప్పిపొడుపుగా.

ప్రేమ మైకంలో వున్నప్పుడు తప్ప, పెళ్ళయ్యాక అతని చేత తను సిగరెట్లు మాన్పించలేనని ఆమెకి చాలా నేచురల్‌గా తెలిసిపోయింది.

అయితే కాంతారావు 'సుఖపెట్టడం' అనేమాటని వేరే విధంగా అర్థం చేసుకుని రోషంతో వణికిపోయాడు.

"అంటే సిగరెట్లు మానలేననే కదా నీ ఉద్దేశం"

"ఉద్దేశం కాదు, వాస్తవం"

"నేను సిగరెట్లు మానలేక పోవడం ఏమిటి? గ్యారంటీగా మానేస్తాను. మానేసి చూపిస్తాను. నా తడాఖా అప్పుడు కాని తెలీదు" అన్నాడు కాంతారావు పట్టుదలగా.

"ఇప్పుడు మీరు రోమియో, సలీం స్టైల్లో అన్నారు. ప్రేమకి త్యాగం వుండాలండీ ఇందుకే" అంది రజని. ఛాన్సొచ్చిందని తనకి తెలిసిన సూక్తులన్నీ ఏడాపెడా చెప్పిందామె. తన బంధువుల్లో సిగరెట్లు మానేసిన వాళ్ళు ఉక్కుముక్కల్లా ఎలా తేలారో కూడా సవివరంగా చెప్పింది.

కాంతారావు ఏం మాట్లాడలేదు. జెయింట్ వీల్ వైపు చూస్తూ ప్రపంచంలో సమస్త బాధలూ తనకే వచ్చినట్టు ఫీలయ్యాడు. రజనికి మాటిచ్చినా చాటుగా సిగరెట్లు కాలిస్తే ఏమిటి? అనే దుర్మార్గమైన ఆలోచన కూడా కాంతివేగంతో తట్టిందతనికి.

"ఛ...... అది చాలా తప్పుకదా" అని కూడా అనిపించింది. రజనీ కోసం, రజనీ చేత ప్రేమ కోసం తను సిగరెట్లు మానగలడు. తనంతటివాడు. అష్టరాల్ సిగరెట్లు మానలేకపోవడం ఏమిటి? అబ్సర్డ్......... అందుకే తను మానేస్తాడు.

"సిగరెట్లు కాల్చడం ఒకటేనా? ఇంకా ఏవైనా దురలవాట్లున్నాయా?" అడిగింది రజని. రెండు ఐస్ క్రీం తెచ్చి ఒకటి అతనికిచ్చింది.

"ఇదొక్కటే తప్ప ఇంకేం లేవు" అన్నాడు కాంతారావు రెడీ మేడ్‌గా.

"మొన్న మీ రూముకి వచ్చినప్పుడు పెరట్లో ఖాళీ సీసాలు చూశాను"

"అవునవును, హార్లిక్స్ సీసాలు ఇంట్లో ఎందుకని బైట పారేశాను"

'హార్లిక్స్ సీసాలు కాదు. మెక్డొవెల్ విస్కీ సీసాలు. మందు అలవాటు కూడా వుందనుకుంటాను" అంది రజని. కాంతారావు ఉలిక్కిపడి, ఐస్‌క్రీం తినడం ఆపి ఆమె మొహంలోకి చూశాడు. మెక్డొవెల్, మందుకొట్టడం

లాంటి మాటలు రజని మాట్లాడడం అతని కెందుకో నచ్చలేదు.

"అవి పక్కింటి వాళ్ళవి"

"మీ పక్కింటాయన మా నాన్న బెస్టు ఫ్రెండు. గాంధీగారు చనిపోయాడని ఇంట్లోనే వుంటున్నాడు కాని, లేకపోతే సబర్మతి ఆశ్రమంలోనే చేరిపోయుండే వాడు. మీరో రోజు తాగి ఓ కిళ్ళీ కొట్టువాడితో తగాదా వేసుకున్నార్ట. మా ఫ్రెండు వాళ్ళ మేడ మీంచి చూసి నాతో చెప్పింది.

కాంతారావు చాలా ఇబ్బందిగా కదిలాడు. రుజా లుంటే 'డినై' చేసేడం బాగుండదేమో.

"అవన్నీ ఇప్పుడెందుకు?"

"ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు? మీరు పూర్తిగా నాశనమయ్యాక మాట్లాడుకుందామా?" అంది రజని.

"నువ్వు అనవసరంగా పెద్దపెద్ద మాటలు...... నాశనం, ధ్వంసం, మహాప్రళయం...... అని మాట్లాడకు. ఏదో సరదాగా తాగాను అంతే"

"అందరూ సరదా కోసమే తాగుతారు.తర్వాత అదే అలవాటవుతుంది. మా బంధువుల్లో ఒకాయన బాగా తాగి తాగి లివర్ జబ్బుతో చనిపోయాడు. ఇంకో అతను రెస్పిరేటరీ ట్రబుల్‌తో చనిపోయాడు. మీరు మాత్రం తాగొద్దు"

"నువ్వు రేడియోలో ఉదయాన్నే సూక్తిముక్తావళి చెప్పకూడదూ?" అన్నాడు కాంతారావు కోపంగా. రజని తనని ప్రేమిస్తోందా? సి.ఐ.ఏ. తరఫున స్పైయింగ్ చేస్తోందా? అని కూడా అనుమానం వచ్చింది. తలెత్తి ఆమె వైపు చూశాడు. నోటీస్ లేకుండా వానొచ్చి నట్టు రజని కళ్ళనిండా నీళ్ళు.

"మీకు నా మీద నిజంగా ప్రేమలేదు" అందామె. కాంతారావు విలవిల్లాడి పోయాడు. రజని 'ఏడవడం అతనికిససేమిరా నచ్చలేదు.

"అప్పుడొక్కసారి బుద్ధిలేక తాగాను. ఇంకెప్పుడూ తాగనంటే తాగను. ఏ ఒట్టు కావాలంటే ఆ ఒట్టే స్తాను" అన్నాడు కాంతారావు. రజనినవ్వింది. ఓ క్షణం క్రితం ఏడ్చింది ఈవిడేనా? మహాశ్చర్య పడ్డాడతను.

"మీరు రేపట్నుంచీ, కాదు కాదు, ఈ క్షణం నుంచి సిగరెట్లు, సరదా తాగుడూ మానేస్తున్నారు."

"అవును, మానేస్తున్నాను."

"రేపు మళ్ళీ ఇదే అలవరసల మీదకలుసు కుందాం" అంది రజని, శ్రీలంక రేడియో తెలుగు పద్ధతిలో. ఆమెని ఇంటిదాకా పంపించి, రూము కెళ్ళాడు కాంతారావు.

అయితే మర్నాడు వాళ్ళిద్దరూ కలుసుకోవడం కుదర్లేదు. వారం తర్వాత ఎగ్జిబిషన్ గ్రౌండ్లోనే కలుసుకున్నారు. గంట సేపు అటూ, ఇటూ తిరిగి ఓ చోట కూర్చున్నారు.

"సిగరెట్లు మానేశాను రజనీ. ఇవాల్టికి సరిగ్గా వారం అయిపోయింది. వాటి జోలికి వెళ్ళలేదు చూశావా?"

"మరి తాగుడు?"

"అదసలు అలవాటేలేదు. ఎప్పుడన్నా సరదాగా తాగేవాణ్ణి. ఇప్పుడదీ లేదు" అన్నాడు కాంతారావు. ఫుల్‌షర్టు మడతలోంచి కిళ్ళీ తీసి వేసుకున్నాడు. అతని షర్టు మడతల్లో మడత మడతకో కిళ్ళీ వుంది. రజని లెక్క పెట్టింది. మొత్తం ఎనిమిదునానయి. కాంతారావు రెండు నిమిషాల కోసారి పక్కనే ఉమ్మేస్తున్నాడు.

"సిగరెట్లు మానేసి కిళ్ళీలు నములు తున్నారా?"

"అవి మానమంటే కిళ్ళీలు తినొచ్చని అర్థంకాదు?"

"కిళ్ళీలు కూడా వేసుకోకూడదా?" ఆశ్చర్యంగా అడిగాడు కాంతారావు.

"కూడదు. ఎందుకంటే పళ్ళు గారపడతాయి. ఎనామిల్ పాడైపోతుంది. పళ్ళు లూజై త్వరగా ఊడి



పోతాయి. అన్నట్టు త్రోట్ కాన్సర్ కూడా వస్తుందిట. ఇంతకీ ఏం కిళ్ళీలు వాడుతున్నారు? జర్దా, సీటే, సాదా, కారా?"

"జర్దా"

"రత్నా జర్దాయా? బాబా జర్దాయా?"

"రత్నా" అన్నాడు కాంతారావు. రజనికి కిళ్ళీల పేర్లు కూడా తెలుసు. స్పృహ తప్పుతుందేమోనని అనుమానం వచ్చిందతనికి. కిళ్ళీ నమలడం మర్చిపోయి ఆమె వైపు ఆశ్చర్యంగా చూశాడు.

"ఇవి కూడా మానెయ్యాలంటావా?" చాలా నీరసంగా అడిగాడు కాంతారావు. చంద్రమండలంమీంచి భూమివైపు చూస్తూ అడుగుతున్నట్టు ఫీలయ్యాడతను.

"తప్పకుండా నీకు తెలీదు కాంత్... కిళ్ళీలుకూడా పరమ డేంజరస్. మా బంధువుల్లో ఒకాయన......"

తర్వాత మాటలు కాంతారావుకి వినిపించలేదు. కిళ్ళీలు తీసిపారేసి, పంపుదగ్గరకి వెళ్ళి నోరు కడుక్కొని వచ్చాడు.

"యు ఆర్ నైస్ మాన్...... ప్రేమించుకోడం ఏం వుంది? చీమలు కూడా తెలుసు ఒకరి కోసం ఒకరు ఇలా త్యాగాల్ చెయ్యడం చాలా గొప్ప సంగతి" అంది రజని అతని చెయ్యి తన చేతిలోకి తీసుకొని మెల్లిగా నొక్కి. కాంతారావు వెంటనే తన కష్టాల నన్నింటినీ మరచిపోయాడు.

రజని బాగ్ తెరిచి పేకముక్కలు బైటికి తీసింది.

"ఇప్పుడు ఇవెందుకు" అడిగాడు కాంతారావు.

"ఈ ముక్కనేమంటారు?" అడిగింది రజని ఓ పేక ముక్క చూపిస్తూ.

"ఆటీన్ ఆరు"

"థాంక్‌గాడ్" మీకు పేకాట రాదు. ఇది ఇస్పేటారు" అందామే.

కాంతారావు అయోమయంగా చూశాడు.

"పేకాట వచ్చా అనడిగితే సరిపోతుంది కదా! దీనికోసం పేకముక్కలు తేవడం దేనికి?"

"డైరెక్టుగా రుజా చేసుకోవడానికి" అంది రజని నవ్వుతూ. పేక ముక్కలు బాగ్‌లో పడేసింది.

"రేసులకెళ్తావేమో అడగలేదేం?"

"మనూళ్ళో లేవు కదా. ఆ భయం లేదు"

"లాటరీ టిక్కెట్లు కొంటావు"

"అదేం దురలవాటు కాదు. ఛాన్సొస్తే డబ్బొస్తుంది కూడా"

"అది ప్రభుత్వం నేర్పిన దురలవాటు"

"ఆరోగ్యానికేం నష్టం లేదు" అంది రజని నవ్వుతూ.

"ఏ సినిమాలు చూడాలో, ఏ పుస్తకాలు చదవాలో కూడా చెబితే సరిపోతుంది" అన్నాడు కాంతారావు మండిపడుతూ.

"వాటికి నేనేం అడ్డు చెప్పను. సినిమాలంటే గుర్తొచ్చింది. సెక్సుగాడవలేం లేవు కదా మీకు?"


"అంటే?"

"అదే ఆడాళ్ళతో తిరగడం"

"ఛీ... ఛీ... ఆడాళ్ళని సినిమాల్లో తప్ప విడిగా ఎప్పుడూ చూడలేదు" అన్నాడతను. అతిశయోక్తేకాని మరీ దారుణంగా వుందని అతనికే అనిపించింది.

"అంటే అదికూడా వుందన్నమాట"

"లేదు. నిజంగా లేదు. ఇన్ని ఒప్పుకున్నవాణ్ణి ఇది మాత్రం ఒప్పుకోనూ! నా మీద అంత నమ్మకం లేకపోతే గుడ్ బై చెప్పేసుకుందాం రజనీ" అన్నాడు కాంతారావు. రజని ఏం మాట్లాడకుండా ఓరకంటితో అతనివైపు




చూసింది. కాంతారావు మోహంలో నిజాయితీ వుంది.

"సరే మీ మాట నమ్ముతున్నాను" అంటూ లేచిం .దామె.

"రేపు శనివారంకదూ గుళ్ళో కలుసుకుందాం" అన్నాడతను. తలూపి వెళ్ళింది రజని.

మర్నాడు వాళ్ళిద్దరూ గుడిపక్కనే వున్న చెరువు గట్టుమీద కూర్చున్నారు. కాంతారావు జేబులోంచి వక్క పొడి పాకెట్ తీసి కొంచెంవేసుకుని, ఆమెకివ్వ బోయాడు. ఏదో పాముని అందిస్తున్నట్టు చెయ్యి వెనక్కి తీసుకుంది రజని.

"వక్కపొడి తింటున్నారా?" అడిగిందామె.

"కనీసం...... వక్కపొడి, వక్కపొడి కూడా వేసు కోకూడదా?"

"వేసుకోకూడదు. ఇది కూడా......"

"పరమ ఘోరమైన, మహా భయంకరమైన, డేంజరస్ దురలవాటు..." అని వక్కపొడి పాకెట్ శక్తికొద్దీ చెరువులోకి గిరాటేశాడు కాంతారావు.

"వెరీగుడ్" మెచ్చుకుంది రజని.

"సిగరెట్లు మాన్పిస్తే మంచిదేననుకున్నాను. సరదా తాగుడు వదిలేశాను.. కిళ్ళీలు మానేశాను. ఆఖరికి వక్కపొడి కూడా మాన్పించావు. నువ్వు హిట్లర్ టైమ్‌లో పుట్టుంటే వాడు యూదుల్ని చంపేవాడు కాదు. రెండో ప్రపంచ యుద్ధం వచ్చేది కాదు" అన్నాడు కాంతారావు కసిగా. మళ్ళీ అతనే అన్నాడు –

"నశ్యం పీలుస్తావా? అని అడగలేదేమిటే?"

"సిగరెట్లు మానేస్తే ముసలాళ్ళు పీలుస్తారు కాని, యువకిశోరాలు పీల్చవు" అంది రజని మూవింగ్ ఎన్ సైక్లోపిడియాలాగా. కాంతారావు ఆమె వైపు చాలా మంటగా చూశాడు. రజని నవ్వింది తృప్తిగా, గర్వంగా.

"ఏ దురలవాటు లేనివాణ్ణే పెళ్ళి చేసుకోవాలను కున్నాను. ఐ యామ్ లకీ ఇనఫ్......" అంది రజని.

నిజమే, కాంతారావు అన్ని దురలవాట్లుమానేశాడు. సకల సుగుణాభిరాముడు, సద్గుణశోభితుడూ అయ్యాడు. ఇరుగు పొరుగు వాళ్ళంతా (వాళ్ళిద్దరికీ పెళ్ళయ్యాక) "రజని మొగుడు చూశారా, ఎంత మంచివాడో, ఒక్క టంటే ఒక్క దురలవాటు కూడా లేదు" అని చెప్పుకో తగ్గవాడయ్యాడు.

అయితే బలవంతపు సంస్కరణ వల్లనో ఏమో కాంతారావు ఇప్పుడు ఆనందించడం మరిచిపోయాడు.

(నీతి: ఎవరి దురలవాట్లను వారే స్వయం కృషితో మానుకొన వలెను.)